# రక్తం చిందని గాయం

గురుదాస్‌పూర్ నుంచి సుమారు వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న అటవీ ప్రాంతం అది.

అర్ధరాత్రి దాటింది!...

ఎటు చూసినా కటిక చీకటే తప్ప, కన్ను పొడుచుకున్నా అక్కడేమీ కనిపించటంలేదు...

కీచురాళ్ళ ధ్వని తప్ప మరెలాంటి శబ్దమూ వినిపించటం లేదు. ఆ నిశ్శబ్దాన్ని చీల్చుకుని - ఓ వైపునించి కొన్ని గొంతులు నెమ్మదిగా వినిపిస్తున్నాయి -

"టిల్లూ...?"

"ఏందన్నా...?"

"నిద్రపోతున్నావా?"

"లేదన్నా! ఈ టెన్షన్‌లో నిద్రేడొస్తది?"

"అరే!... సుభాన్‌భాయ్?" - మళ్లీ మొదటిగొంతు వినిపించింది.

"చెప్పన్నా"

"టైమెంత?"

"రెండూ నలభై!"

"మరీపాటికి సుధీర్‌బాగ్ పోయే బస్సు రావాల్సిందేనే?" తనలో తానే అనుకున్నట్టుగా అన్నాడతను.

ఆ వెంటనే - కొంచెం దూరంలో వెలుతురు కనిపించింది.

"అన్నా! అటు చూడు... అది బస్సే" - ఉత్సాహంగా చెప్పాడు సుభాన్.

"అవును. అది సుధీర్‌బాగ్ బస్సే అయి వుంటుంది. అందరూ రెడీగా ఉన్నారా?" మొదటి వ్యక్తి అడిగాడు.

"రెడీ అన్నా!" తక్కిన గొంతులన్నీ ముక్త కంఠంతో జవాబు చెప్పాయి....

"అయితే, రండి!" రోడ్డుమీదకు దారి తీశాడతను. తక్కినవాళ్లు అతన్ని అనుసరించారు.

మరికొన్ని క్షణాలు గడిచాయి.... బస్సు, వాళ్ళను సమీపించింది... అందరూ ఒక్కసారిగా వెళ్లి బస్సుకి అడ్డంగా నిలబడ్డారు.

ఎంతో అప్రమత్తంగా బస్సు నడుపుతున్న డ్రైవరు జలాలుద్దీన్‌కి పరిస్థితి అర్థమైంది. ఏంచేయాలో తోచలేదు. ఇలాంటిదేదో ఒకనాడు జరుగుతుందని అతను భయపడుతూనే ఉన్నాడు. చివరకు ఇప్పుడు ఆ దుర్ముహూర్తం రానే వచ్చింది....

ఒకరో ఇద్దరో బస్సుకి అడ్డంగా నిలబడితే వాళ్ళను లక్ష్యపెట్టకుండా - బస్సు వేగాన్ని మరింత పెంచి ధైర్యంగా వెళ్ళిపోయేవాడు...!

కానీ, ఇప్పుడక్కడ రోడ్డుమీద బస్సును ఆపమంటూ చేతులు పైకెత్తి నిలబడిన వాళ్ళు ఎనమండుగురున్నారు.

అందరి చేతుల్లోనూ మారణాయుధాలున్నాయి!

అందుకే ఆలోచనలో పడ్డాడు జలాలుద్దీన్...

బస్సుని ఆపకుండా వేగం పెంచి ముందుకు దూసుకుపోతే - వాళ్లలో ఇద్దరు ముగ్గురు గ్యారంటీగా హతమయిపోతారు... కానీ, తక్కినవాళ్ళు, తమ చేతుల్లో ఉన్న బాంబుల్ని బస్సులోకి విసురుతారు. బస్సు దగ్ధమైపోతుంది. బస్సులో ఉన్న అరవైమంది ప్రయాణీకుల్లో అధికశాతం గుర్తుపట్టేందుకు సైతం వీల్లేకుండా కాలిపోతారు.. తక్కిన వాళ్ళు తీవ్రంగా గాయపడతారు.

బస్సుని ఆపేస్తే - ప్రయాణీకుల్ని దోచుకుంటారు..

ఏం చేయాలి?

ఎవరైనా ఏం చేస్తారు?

ప్రాణం కంటే డబ్బు విలువైనది కాదు!!

ఆ ఆలోచన అతనిలో ధృఢపడగానే - బస్సుకి 'సడెన్'బ్రేకులు వేశాడు... కీచుమని శబ్దం చేస్తూ బస్సు ఆగిపోయింది... నిద్దట్లో ఉన్న ప్రయాణికులు ఉలిక్కిపడి లేచారు... ఏం జరిగిందో వాళ్ళకు అర్థం కాలేదు... ఏం జరగబోతోందో అసలే తెలియలేదు...

"ఏమిటి భాయ్! బస్సు ఆగిపోయిందేమిటి!" ఫ్రంట్ సీటులో కూర్చున్న ఓ ప్రయాణీకుడు పక్కవాణ్ణి ప్రశ్నించాడు.

అతను జవాబు చెప్పేలోపుగానే - డోరు తెరుచుకుని - ఆ ఎనమండుగురూ లోపలకు ప్రవేశించారు... ఇప్పుడు ప్రయాణీకులందరికీ - ఏం జరగబోతోందో తెలిసి పోయింది.

అప్పటికి డ్రైవరు స్విచ్ ఆన్ చేశాడు... బస్సులో లైట్లన్నీ వెలిగాయి. బస్సులోకి దూకుడుగా ప్రవేశించిన అగంతుకుల్ని చూశారు ప్రయాణికులు... అందరి చేతుల్లోనూ తుపాకులున్నాయి... ముఖాలు కనిపించకుండా వాళ్ళంతా ముసుగులు ధరించి ఉన్నారు.

"ఎవరూ కదలకండి... మాట్లాడకండి!!" ఓ ముసుగు మనిషి అందరికీ వినిపించేలా అరిచాడు.

"నోరు మెదిపితే కాల్చేస్తాం!" అతని పక్కనే ఉన్న మరో వ్యక్తి, చేతిలోని తుపాకిని పైకెత్తి చూపిస్తూ చెప్పాడు.

"ఎవరు మీరు?... ఏంకావాలి మీకు?" ముందు సీట్లో కూర్చున్న ప్రయాణికుడు ధైర్యంగా అడిగాడు.

"మేం ఎవరిమో మీకనవసరం! మాక్కావలసింది మేం తీసుకుంటాం. మీకేం భయంలేదు. ఎవరూ మాట్లాడకుండా - ఎక్కడివాళ్ళక్కడే కూర్చోండి!" లావుగా ఉన్న ఓ ముసుగు మనిషి గుమ్మం దగ్గర నిలబడి చెప్పాడు. ప్రయాణికులందరూ బిక్కచచ్చిపోయి-ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వాళ్ళవైపు అలాగే చూస్తున్నారు.

"డ్రైవర్! లైట్స్ ఆఫ్ కరో!" ఆదేశించాడు లావుపాటి వ్యక్తి.

డ్రైవర్ స్విచ్ ఆఫ్ చేశాడు. బస్సులో చీకటి వ్యాపించింది.

వెంటనే ఓ ముసుగు మనిషి తన చేతిలో ఉన్న బ్యాటరీలైటు వెలిగించి బస్సులో వెనక్కి ఫోకస్ చేశాడు... మరో ముగ్గురు మనుషులు వెనక సీట్లవైపు నడిచారు.

"మీ జేబుల్లో ఉన్న డబ్బూ, పర్సులూ తీసివ్వండి! ఊఁ, త్వరగా! ఆడోళ్ళు కూడా! మెడలో నగలన్నీ తియ్యండి. నోరు మెదిపారా - ప్రాణాలు పోతాయ్" - అంటూనే వాళ్లు ముగ్గురూ ప్రయాణికుల్ని దోచుకోవటం ఆరంభించారు. లావుపాటి వ్యక్తి మాత్రం గుమ్మం దగ్గరే నిలబడ్డాడు. తక్కిన వాళ్ళు, ముందున్న ప్రయాణికుల జేబులు ఖాళీ చేశారు. రిస్టు వాచీలు , మెడలో గొలుసులు, జేబులో పర్సులు - అన్నీ వాళ్ళ హస్తగతం చేసుకున్నారు. "ఊఁ, ఇక అందరూ చప్పుడు చెయ్యకుండా కిందికి దిగిపొండి, త్వరగా! బస్సుని తగలబెడుతున్నాం! ఆలస్యం చేస్తే మీరు మంటల్లో కాలిపోతారు!"- గేటు దగ్గరున్న వ్యక్తి కిందకి దిగుతూ చెప్పాడు. చేతికందిన తమ సామాన్లు పట్టుకుని- గబగబా ప్రయాణికులంతా ఒకరినొకరు తోసుకుంటూ - అయిదు నిమిషాల్లో కిందకు దిగిపోయారు.

ఓ ముసుగు మనిషి డ్రైవరు సీటు దగ్గరకు వెళ్ళి డీజిల్ ట్యాంకును బద్దలు కొట్టాడు. వెంటనే కిందకు దిగి సిగరెట్ లైటరు వెలిగించి దాన్ని డీజిల్‌లోకి విసిరేశాడు... బస్సులో మంటలు లేచాయి...

"రఘువీర్ దళం వర్ధిల్లాలి...!" అని నినాదాలు చేస్తూ ముసుగు మనుషులంతా రోడ్డు పక్కకు వెళ్ళి దట్టమైన అడవిలోకి మాయమయ్యారు.

★ ★ ★

డైరెక్టర్‌జనరల్ ఆఫ్ పోలీస్ కార్యాలయం ముందు నాలుగు జీపులు నిలిచి వున్నాయి. అప్పుడే అక్కడకు వచ్చిన మరో అంబాసిడర్ కార్లోంచి కమీషనర్ గుర్బాన్‌సింగ్ కిందకు దిగాడు.

ఆఫీసు ముందున్న కానిస్టేబుళ్ళు అతనికి సెల్యూట్ చేశారు... గుర్బాన్‌సింగ్ వాళ్ళను అంతగా పట్టించుకోకుండానే - పరుగులాంటి నడకతో - లోపలకు నడిచాడు.

లోపల - కాన్ఫరెన్స్ రూమ్‌లో అప్పటికే చాలామంది పోలీసు ఉన్నతాధికారులు ఆసీనులై ఉన్నరు... వాళ్ళ మధ్యన కూర్చున్న డైరెక్టర్‌జనరల్‌కి గౌరవ సూచికంగా సెల్యూట్ చేసి - కూర్చున్నాడు గుర్బాన్ సింగ్.

ఇద్దరు కుర్రాళ్ళు అందరికీ కాఫీ కప్పులు అందించారు.

పొగలొస్తున్న వేడి కాఫీని 'సిప్' చేసి డీ.జీ.పి. అన్నాడు -

"మీ అందర్నీ ఇవాళ ఇక్కడకు పిలిచిన కారణం మీరిపాటికి ఊహించే ఉంటారు."

అందరూ ఆసక్తిగా డీ.జీ.పి. వైపు చూశారు...

రెండు క్షణాల నిశ్శబ్దం తర్వాత మళ్ళీ అతనే చెప్పటం ప్రారంభించాడు -

"మన రాష్ట్రంలో ఒకవైపు తీవ్రవాదులూ - మరోవైపు దోపిడీ ముఠాలూ స్వైరవిహారం చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్తుల్ని ధ్వంసం చేస్తున్నారు. వీళ్ళ కార్యకలాపాలు రోజు రోజుకీ మితి మీరిపోవటం వల్ల - ప్రజల్లో మన పోలీసు వ్యవస్థ మీద గౌరవాభిమానాలు సన్నగిల్లిపోతున్నాయి. నిన్న రాత్రి గురుదాస్‌పూర్ సమీపంలో సుధీర్‌బాగ్ బస్సులో ప్రయాణీకుల్ని దోచుకుని - తర్వాత ఆ బస్సుని తగులపెట్టిన సంగతి మీకీపాటికి తెలిసే ఉంటుంది!" అని చెప్పటం ఆపి - బల్లమీదున్న సిగరెట్ ప్యాకెట్ లోంచి సిగరెట్టు తీసి వెలిగించుకున్నాడు.

"ఇలాంటి విధ్వంసక చర్యలు మన రాష్ట్రంలోనే కాదు.. అటు ఆంధ్రరాష్ట్రంలోనూ, ఇటు తమిళనాడులోనూ కూడా జరగుతూనే ఉన్నాయ్ సార్... ఇలాంటి వాటిని అరికట్టాలంటే - కేవలం మన పోలీసుఫోర్స్ ఒక్కటీ సరిపోదు...! సెంటర్ - స్టేట్ గవర్నమెంట్స్‌తో సంప్రదించి - అవసరమైన చోట స్పెషల్‌పోలీస్ ఫోర్స్‌ని అపాయింట్ చేయాలి!" - అన్నాడు కమీషనర్. అతని మాటలు శ్రద్ధగా విన్న డీ.జీ.పి. తల పంకించి - కుర్చీలోంచి లేచాడు.

"యస్! యూ ఆర్ కరెక్ట్!... ఆ విషయం గురించి ప్రస్తావించేముందు - మీకో సంగతి చెప్పాలి!" - అంటూ పక్కనే గోడపై వేలాడుతున్న భారతదేశ పటంవైపు నడిచాడు...

పక్కనే బల్లపై ఉన్న పొడవైన 'స్టిక్' చేతిలోకి తీసుకుని, దాంతో పటంలోకి చూపించి చెప్పాడు -

"ఇది రాంపూర్ జిల్లా. ఇక్కడ... ఈ ప్రాంతమంతా దట్టమైన అటవీ ప్రాంతం. ఇదిగో ఈ స్పాట్‌లో - నిన్న రాత్రి తీవ్రవాదులు సుధీర్‌బాగ్ వస్తున్న ప్రయాణీకుల్ని దోచుకుని - బస్సు తగులబెట్టారు... ఇది తారాపూర్.. ఇక్కడ గత నెలలో ఒక బ్యాంకును లూటీ చేశారు. దట్ మీన్స్ - ఈ అటవీ ప్రాంతంలోనే ఎక్కడో వాళ్ళ స్థావరాలు ఉండి తీరాలి!"

"అయితే, ఆ ఫారెస్టంతా గాలింపు చర్యలు ఆరంభిస్తే మంచిది సార్!" ఓ పోలీసధికారి వెంటనే అన్నాడు.

మళ్ళీ డీ.జీ.పి తన కుర్చీలో కూర్చుని చెప్పాడు -

"యస్! రాత్రి హోంమినిస్టర్ నన్ను పిలిచారు. ఈ విషయం గురించే చాలాసేపు డిస్కస్ చేశారు. తీవ్రవాద కార్యకలాపాలు మన రాష్ట్రంలోని ఏయే ప్రాంతాల్లో ఎక్కువ జరుగుతున్నాయో అక్కడికల్లా స్పెషల్ పోలీస్ ఫోర్సుని పంపించమన్నారు. సెంటర్‌తో కూడా ఆయన మాట్లాడారు. రెండు మూడు రోజుల్లో సెంట్రల్ పోలీస్ ఫోర్స్ కూడా మన స్టేట్‌కి వస్తోంది...."

డీ.జీ.పి. చెప్పిందంతా విన్నాక కమీషనర్ ఉత్సాహంగా అన్నాడు -

"అలా అయితే మేం అందరం మా దృష్టిని ఆ ఫారెస్ట్ ఏరియాపైనే లగ్నం చేస్తాం.. తీవ్రవాదుల్ని నామరూపాలు లేకుండా చేస్తాం సార్!"...

"వెరీ గుడ్! ఆల్ ది బెస్ట్!" అంటూ లేచాడు డీ.జీ.పి.

★ ★ ★

కుందన్‌పూర్ చాలా చిన్న గ్రామం!...

ఆ ఊళ్లో మహా ఉంటే మూడు వందల కుటుంబాలుంటాయి... అన్నీ దాదాపు మధ్యతరగతి కుటుంబాలే!....

ఆ ఊరికి పదిమైళ్ళ దూరంలో ఓ టౌనుంది... కుందన్‌పూర్ గ్రామానికి రావాలంటే ఆ టౌన్లో బస్సు దిగి టాంగా ఎక్కి రావాల్సిందే.

ఆ రోజు ఇంకా పూర్తిగా తెల్లవారలేదు.

గుమ్మంలో టాంగా ఆగిన చప్పుడు విని - 'చాయ్' కలుపుతున్న ఇంద్రావతి హాల్లోకి వచ్చింది... అప్పుడే టాంగా దిగి లోపలకు వస్తున్న బన్సీలాల్ కనిపించగానే ఆమె కళ్ళు ఆనందంతో మెరిశాయి.

"వచ్చావా బన్సీబాబూ! ఎన్నాళ్ళయిందిరా నిన్ను చూసి?... ఇంతకాలానికి ఈ అమ్మ గుర్తుకొచ్చిందా?" - అంటూ అతని చేతిలో ఉన్న సంచీ అందుకుని పక్కనున్న మంచం మీద పెట్టింది.

"ఏం చేయమంటావమ్మా?.... ఆఫీసు పని తలమునకలుగా ఉంటోంది. దానికి తోడు నెలకు ఇరవైరోజులు క్యాంపులు కూడానూ!" చెప్పాడు బన్సీ.

"అయితే మాత్రం? ఆర్నెల్లకోసారైనా ఈ అమ్మనూ, చెల్లాయినీ చూసేందుకు రాకపోతే ఎలా బాబూ? పోనీ నెలకో ఉత్తరం ముక్కయినా రాస్తావా అంటే అదీ లేదు!". అంటూనే కప్పులో 'చాయ్'పోసి తెచ్చి కొడుక్కి అందించింది.

అంతలో బిందూ లేచి వచ్చింది... అన్నయ్యను చూడగానే ఆమె కన్నుల్లో కూడా ఆనందం తొణికిసలాడింది.

"ఏం బిందూ? బాగా చదువుతున్నావా?" చాయ్ తాగుతూనే అడిగాడు బన్సీ.

"ఓ... బాగానే చదువుతున్నా భయ్యా!" ఉత్సాహంగా చెప్పిందామె...

"వచ్చే నెలలోనే దాని పరీక్షలట్రా!" - చెప్పింది తల్లి.

"గుడ్! కాలేజీకి ఫస్టు రావాలి!" చెల్లికేసి చూస్తూ అన్నాడు బన్సీ.

"సారీ!.. కాలేజీ ఫస్టు గురించి హామీ ఇవ్వలేను కానీ - నీ కష్టం మాత్రం వృధా పోనివ్వను భయ్యా!... ఫస్టుక్లాసు తెచ్చుకుంటాను!" - కృతజ్ఞత నిండిన స్వరంతో దృఢంగా చెప్పింది బిందూ.

బన్సీలాల్ తండ్రి బన్వారీకి టాంగా ఉండేది. ఎంత లేదన్నా ప్రతిరోజూ తన ఊరికీ, టౌనుకీ మధ్య నాలుగైదు ట్రిప్పులు టాంగా తోలేవాడు. రోజూ వంద రూపాయల్దాకా కళ్ళ చూసేవాడు... కుటుంబాన్ని దర్జాగా పోషించేవాడు... పేదరికపు ఛాయలు తన పిల్లల మీద ఎన్నడూ పడకూడదని భావించేవాడు బన్వారీ. ఎటువంటి దురలవాట్లకూ బానిస కాకుండా ప్రతి నెలా పిల్లల పేర ఎంతో కొంత పోస్టాఫీసులో దాచేవాడు. అయితే, పిల్లల భవిష్యత్తుకు దాచిన డబ్బు అనుకోకుండా తనకే కావాల్సివచ్చింది!...

ఒక రోజు రాత్రి, టౌన్ నుంచి టాంగాలో వస్తోంటే-అదుపు తప్పిన లారీ ఒకటి టాంగాని గుద్దేసింది. గుర్రం చచ్చిపోయింది. టాంగా ముక్కలైపోయింది... బన్వారీకి బలమైన గాయాలు తగిలి స్పృహ కోల్పోయాడు. టౌన్‌లోనే అతన్ని హాస్పిటల్లో చేర్పించవలసి వచ్చింది. పదిరోజుల దాకా స్పృహరాలేదు. ఈలోగా, అతను పిల్లలకోసం పొదుపు చేసిన డబ్బంతా హారతి కర్పూరంలా హరించుకుపోయింది. అయినా ఫలితం మాత్రం దక్కలేదు...

పదకొండో రోజున బన్వారీకి స్పృహ వచ్చింది. కానీ, ఎంతోసేపు అతని చూపు నిలవలేదు. ఆ చివరి క్షణంలో కొడుకుని దగ్గరకు పిలిచి - "అమ్మనూ, చెల్లాయినీ జాగ్రత్తగా చూసుకోవాలి బాబూ!" అంటూ ఒకే ఒక్కమాట చెప్పి - తుది శ్వాస విడిచాడు...

ఆమాటే బన్సీలాల్‌కి వేదవాక్కయింది. పదోక్లాసు పరీక్ష రాయకుండానే చదువు మానేశాడు..

"మిమ్మల్ని పోషించటానికి ఏదో ఒక ఉద్యోగంలో చేరతాను!" అంటూ తల్లికి చెప్పి ఇంటి గడప దటాడు..

తర్వాత ఆర్నెల్లు గడిచినా అతని జాడ లేకుండా పోయింది.

అతని తల్లీ, చెల్లీ కంగారు పడ్డారు. ఒంటిమీద బంగారు నగలూ, ఇంట్లో వస్తువులూ ఒకటొకటే అమ్మి రోజులు గడుపుకున్నారు...

ఆ తర్వాత హఠాత్తుగా ఓ రాత్రి బన్సీలాల్ ఇంటికొచ్చాడు... తనకు మంచి ఉద్యోగం దొరికిందనీ, తమ కష్టాలు తొలగిపోయాయనీ చెప్పాడు... తల్లి చేతిలో రెండు వేలు పెట్టాడు... చెల్లికి కొత్త బట్టలు కొనిపెట్టాడు.

నాలుగు రోజులుండి వెళ్ళిపోయాడు..

అప్పటి నుంచీ ఏడాదికి నాలుగైదుసార్లు సెలవు మీద ఇంటికొస్తూనే ఉన్నాడు. తల్లి యోగక్షేమాలు తెలుసుకుంటున్నాడు. చెల్లాయిని శ్రద్ధగా చదివిస్తున్నాడు.

"ఈ సారైనా పదిరోజులు ఉంటావా బన్సీబాబూ?" ఆ రాత్రి భోజనం అయిన తర్వాత అడిగింది తల్లి.

"లేదమ్మా! రెండ్రోజులు సెలవు దొరకటమే కష్టమైపోయింది. చెల్లాయి పరీక్షలు దగ్గరకొచ్చాయి కదా. ఎలా చదువుతోందో తెలుసుకోవచ్చునని వచ్చాను. నిన్ననే మాకు బోనస్ కూడా ఇచ్చారు. నీకు డబ్బు ఇచ్చినట్టు కూడా ఉంటుందనీ" - అంటూనే బ్యాగ్ లోంచి ఓ నోట్ల కట్ట తీసి తల్లికి అందించాడు.

ఆ డబ్బు అందుకుంటున్న ఇంద్రావతి కళ్ళలోకి అప్రయత్నంగా నీరు ఉబికి వచ్చింది.

"ఏమిటోరా బన్సీ! భగవంతుడు ఈ కుటుంబ భారాన్నంతా నీపై మోపాడు... మీ నాన్నే బ్రతికుంటే ఈ పాటికి నువ్వు ఏ ఇంజనీరింగో చదువుతూ ఉండేవాడివి! హఠాత్తుగా ఆయన దూరమై మాకంటే నీకే ఎక్కువ అన్యాయం చేశారు!".. పైట చెంగుతో కళ్ళు ఒత్తుకుందామె.

"అదేమిటమ్మా అలా మాట్లాడతావ్?... కొడుకన్న తర్వాత కటుంబభారాన్ని పంచుకోవటం ముఖ్యం కాదా?" తల్లిని ఓదార్చే ధోరణిలో అన్నాడు బన్సీలాల్.

పక్కనే కుర్చీలో కూర్చుని చదువుకుంటున్న బిందూ అక్కడకు వచ్చింది.

"అమ్మ ఎప్పుడూ అలాగే మాట్లాడుతుందన్నయ్యా!.. ఆవిడగారి ఆలోచనలన్నీ ఎప్పుడూ నీ గురించే!.. ఆ సంగతులకేంగానీ, నీ ఆఫీసు విశేషాలు చెప్పు!... నువ్ ఉద్యోగంలో చేరి మూడేళ్ళయిపోయింది కదా! ఏదైనా ప్రమోషన్ వచ్చిందా?" అడిగింది.

"నేను పని చేసేచోట ప్రమోషన్లివ్వరమ్మా!.. అన్నీ బాధ్యతలే!.. ప్రయివేటు వుద్యోగం కదా!".

అంతలో తల్లి కలుగచేసుకుంటూ అడిగింది -

"ఒరేయ్ బన్సీ! ఈ ఏటితో బిందూ చదువు అయిపోతుంది. మేం కూడా నీ దగ్గరకు వచ్చేయాలనుకుంటున్నాంరా!"

ఉలిక్కిపడ్డాడు బన్సీలాల్.

"వద్దమ్మా! మరి కొంతకాలం ఓపికపడితే నేనే ట్రాన్స్ఫర్ చేయించుకుని ఇటువైపు వచ్చేస్తాలెండి" చెప్పాడు క్షణం తర్వాత.

"అన్నట్టు నువ్వుండే ఊరికి చుట్టుపక్కల అడవుల్లో తీవ్రవాదులు తిరుగుతుంటారట... నిజమేనా అన్నయ్యా?" బన్సీ కూర్చున్న మంచానికి ఎదురుగా కూర్చీని లాక్కుంటూ అడిగింది బిందూ.

"నేనూ విన్నాను... ఉంటే ఉన్నారేమో!"

"మరి - నెలకు ఇరవై రోజులు క్యాంపులంటూ తిరుగుతావ్... నీకు భయం వేయదట్రా?" తల్లి ప్రశ్నించింది.

బన్సీలాల్ తేలికగా నవ్వేశాడు.

"ఎందుకమ్మా భయం? వాళ్ళేం రాక్షసులా? నీలాంటి, నాలాంటి మనుషులేగా? వాళ్ళకీ మనసుంటుంది. వాళ్ళలోనూ మానవత్వం ఉంటుంది!" - అన్నాడు.

"నిజంగా నువ్వన్నట్టు - మానవత్వం ఉన్నవాళ్లే అయితే - దోపిడీలూ దుర్మార్గాలు ఎందుకు చేస్తారు?.. బస్సుల్ని, రైలు పెట్టెల్నీ ఎందుకు తగలబెడ్తారు?" ఆవేశంగా అడిగింది బిందూ.

"అవన్నీ నీకూ నాకు అంతుపట్టని సంగతులమ్మా!... వాళ్ళ కారణాలు వాళ్ళకి వుంటాయి.!... అసలు ఆ మాటకొస్తే - ఎదురుకాల్పులు నెపంతో - ఎందరో అమాయకుల్ని పోలీసులు చంపుతున్నట్టు పేపర్లో వార్తల్ని మనం చదవటం లేదూ?... అందుకు కక్ష సాధింపుచర్యగా - వాళ్ళు ఆ విధంగా ప్రవర్తిసున్నారేమో?" -

"ఏమో! నాకైతే ఇదేం అంతుపట్టదన్నయ్యా. ఎవరి మీదనో కక్షకట్టి - వేరెవర్నో హింసించటం - ప్రభుత్వ ఆస్తుల్ని నాశనం చేయటం అన్యాయమనిపిస్తుంది!"

"దగ్గర్నుంచి చూస్తేకానీ సమస్యా, దిగితేకానీ లోతూ అర్థం కావు బిందూ!... మనం తేలిగ్గా తీసిపారేస్తున్నాం కానీ - వాళ్ళకీ కొన్ని సిద్ధాంతాలున్నాయి. కొన్ని లక్ష్యాలున్నాయి!" అంటూ ఇంకా ఏదో చెప్పబోతూంటే మధ్యలోనే అడ్డం పడింది తల్లి -

"పోన్లెండి! వీధిలోవాళ్ళ గొడవలు మనకెందుకూ... మన ఇంటి సంగతులు మనం మాట్లాడుకోవాలిగానీ" -

బిందూ అక్కణ్ణించి లేచి వెళ్ళి మళ్ళీ తన పుస్తకం తెరచింది...

కొన్ని నిమిషాలు నిశ్శబ్దం తర్వాత బన్నీ అడిగాడు తల్లిని -

"మన బిందూకి సంబంధాలు ఏవైనా చూస్తున్నావా అమ్మా?"

ఆ ప్రశ్న కోసమే ఎదురుచూస్తున్నదానిలా - వెంటనే చెప్పిందామె -

"ఆ విషయమే నీతో చెప్పాలనుకుంటున్నాను బన్నీబాబూ!... బిందూ ఎవరో కుర్రాణ్ణి ప్రేమించిందట!"

ఆశ్చర్యపోయాడు బన్నీ...

"ప్రేమించిందా? ఎవరా కుర్రాడు?" - అడిగాడు.

"ఏమో... నాకూ తెలియదు... అతని పేరు రణధీర్‌ట! వాళ్ళ కాలేజీలోనే చదివాడట... ఈ మధ్య ఉద్యోగంలో కూడా చేరాట్ట!" - చెప్పిందామె.

ఇంతకీ అబ్బాయిని నువ్ చూశావా లేదా?" - వెంటనే అడిగాడు బన్నీ. తన చెల్లెలు అతని వల్ల ఎక్కడ మోసగింపబడుతుందో అని అతని భయం!... అన్ని విధాలా మంచి వరుణ్ణి తెచ్చి ఆమె పెళ్ళి చేయాలని అతని తాపత్రయం!

"ఆమధ్య ఓసారెప్పుడో అతన్ని ఇంటికి తీసుకొచ్చింది... అబ్బాయి బావున్నాడు! అణకువ కలిగిన కుర్రాడే అనిపించింది. పైగా కట్నం నయాపైస కూడా తీసుకోనని చెప్పాడట!" - చెప్పింది తల్లి.

ఆ మాటలు విన్న బన్నీ తృప్తిగా నిట్టూర్చాడు... తన జోళ్ళు అరిగిపోకుండా, తనకు నచ్చిన జోడీని తన చెల్లెలే ఎన్నుకోవటం అతనికి ఆనందం కలిగించింది.

అయినా, 'కట్నం వద్దన్నాడు కదా' అని కాళ్లు కడిగేసి చేతులు దులిపేసుకోవటం బన్నీకి బొత్తిగా ఇష్టం లేదు... తన బిందూ చేతులకు బంగారు గాజులు చేయించాలి! బంధు మిత్రులనందర్నీ పిలిచి - పెళ్ళి రంగరంగ వైభవంగా చెయాలి!...

"ముహూర్తం పెట్టించి నాకు ఉత్తరం రాయమ్మా! డబ్బు పంపిస్తాను!" చెప్పాడు బన్నీ... విసురుగా అన్నగారి దగ్గరకు వచ్చి అడిగింది -

"అంటే ఏమిటి నీ ఉద్దేశం?... నా పెళ్ళికి డబ్బు పంపిస్తావ్‌కానీ నువ్వు రావా?"

బన్నీకి నవ్వొచ్చింది.

"నేనెందుకు రానమ్మా? నా బంగారు తల్లి పెళ్లికి నేను రాకుండా ఉంటానా?... స్వయంగా నేను అతని కాళ్ళు కడిగి కన్యాదానం చేస్తాను. 'మా చెల్లెమ్మను ప్రాణంలో ప్రాణంగా చూసుకోక పోయావంటే నీ ప్రాణాలు తీస్తాను జాగ్రత్త' అని బావగారికి ఓ వార్నింగ్ కూడా ఇస్తాను!" - అన్నాడు నవ్వుతూనే.

"నీకా అవసరం రాదులే అన్నయ్యా! ఎందుకంటే రణధీర్ నన్ను ప్రాణంలో ప్రాణంగా కాదు- తన ప్రాణసమానంగా చూసుకుంటాడు. కనుక ఆ నమ్మకం నాకుంది!"- గర్వం నిండిన స్వరంతో చెప్పిందామె.

'వెరీగుడ్! ఇంతకీ నాక్కాబోయే బావగార్ని నేనోసారి చూడచ్చా?" కొంటెగా చూస్తూ అడిగాడు బన్నీ.

"అలాగే! రేపు సాయంత్రం మనింటికి టీ కి పిలుస్తానులే!" - చెప్పింది బిందూ.

★ ★ ★

"అయామ్ సారీ బిందూ! నేను రేపు మీ ఇంటికి రాలేను" - బిందూ చెప్పినదంతా విన్నాక అన్నాడు రణధీర్.

నిరాశ నిండిన కళ్ళతో చూసింది బిందూ.

"అదేమిటి రణధీర్! నీకు తెలుసుగా! అన్నయ్యే మా ఇంటికి పెద్ద. నేనంటే ప్రాణం.. తన చెల్లెల్ని పెళ్లి చేసుకునే అందగాణ్ణి తను ముందుగా చూడాలని కోరుకోవటం తప్పా?" బుంగమూతి పెట్టి అడిగింది.

"అదికాదు బిందూ! నన్ను అర్జంటుగా రాంపూర్ వెళ్ళమని మా అధికారులు ఆదేశించారు. ఈ రాత్రికే నేను బయలుదేరి వెళ్ళాలి!" - అసలు విషయం చెప్పాడు రణధీర్.

అర్థం కానట్టు చూసింది బిందూ.

"అక్కడ తీవ్రవాద కార్యకలాపాలు మితిమీరి పోతున్నాయి. వాటిని అరికట్టి తీవ్రవాదుల్ని వెతికి పట్టుకోవాలి! అదీ ఈ వీరుడి డ్యూటీ!" మరింత వివరంగా చెప్పాడు.

"నీది పోలీస్ డిపార్ట్‌మెంట్ కాదుగా!... అలాంటి డ్యూటీలు నువ్వెందుకు చెయ్యాలి?"

"భలేదానివిలే! బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ సిబ్బంది కూడా ఒక రకంగా రక్షక భటుల్లాంటి వాళ్ళే! దేశ సరిహద్దులోకి దుండగులు ప్రవేశించకుండా కాపాడటంతో బాటు - దేశంలో జరిగే అరాచకాల్ని అరికట్టవలసిన బాధ్యతను కూడా అవసరాన్ని బట్టి మాకు అప్పగిస్తూంటారు!..."

ఇంక ఏం మాట్లాడాలో ఆమెకు అర్థం కాలేదు. కానీ, ఆమె మనసులో క్షణం పాటు భయం విద్యుత్తులా ప్రవహించింది.

"ఆ తీవ్రవాదులు దొంగతనంగా, రహస్యంగా జీవిస్తూ దోపిడీలూ దుర్మార్గాలూ చేస్తున్నారు. ఇప్పుడు వాళ్ళను పట్టుకునే ప్రయత్నం చేస్తే నీ మీద కక్ష కట్టరా?" అడిగింది.

ఆమె అమాయకత్వానికి రణధీర్ నవ్వుకున్నాడు -

"పిచ్చి బిందూ! అదా నీ భయం. వాళ్ళను పట్టుకోటానికి మేం చేతులు ఊపుకుంటూ వెడతామనుకుంటున్నావా? మందీ మార్బలంతో వెడతాం!... మా బెటాలియన్‌లో మొత్తం ముప్ఫయ్ మంది ఉన్నాం! మా అందరి దగ్గరా తుపాకులున్నాయి. అయినా, నువ్ రామాయణం, భారతం చదవలేదూ?" - అడిగాడు ఆమె కళ్ళలోకి చూస్తూ.

రామయణ భారతాలు చదవటానికీ - తీవ్రవాదుల్ని పట్టుకోవటానికీ ఉన్న సంబంధం ఏమిటో బిందూకి అవగాహన కాలేదు.

అంతలో మళ్ళీ రణధీర్ అన్నాడు -

"ఆ గ్రంథాలు మనకు చెప్పే నీతి ఏమిటి? ఎప్పటికైనా దుర్మార్గులు, దుష్టులు శిక్ష అనుభవిస్తారు... న్యాయం, ధర్మం, నీతి నిజాయితీలు గెలిచి తీరతాయి...' అంటూ ధైర్యం కలిగించే రీతిలో ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుని దృఢంగా నొక్కాడు.

ఆ చేతిని దగ్గరకు లాక్కుని ముద్దుపెట్టుకుంది బిందూ.

"నువ్ ఇవాళే వెళ్లిపోవాలా?" - తర్వాత కొన్ని క్షణాలకు అడిగింది.

"ఇవాళే కాదు - ఇప్పుడే! - మరో గంటలో మా హెడ్‌క్వార్టర్స్ ఆఫీసుకి బయల్దేరాలి. రాత్రికి రాంపూర్ చేరుకోవాలి. అసలు నేనే ఈ విషయం చెప్పటానికి నీకు కబురు చేయాలనుకున్నాను. ఇంతలో నువ్వే వచ్చావ్.."

"మళ్ళీ ఎప్పుడొస్తావ్?" ఇంటికి బయల్దేరబోతూ అడిగింది బిందూ.

"ప్రస్తుతం మూడు నెలల డ్యూటీ వేశారు. అది అయిపోగానే వచ్చి నీ ఒడిలో వాలిపోతాను. నీ మెడలో మూడు ముళ్ళూ వేసేస్తాను. ఆ తర్వాత ఉద్యోగానికి మూడు నెలలు సెలవు పెట్టేసి - నీతో ముచ్చటగా హనీమూన్‌కి చెక్కేస్తా!.. ఆ తర్వాత ఆరునెలలకే నీకో పండంటి బాబుని ప్రసాదిస్తా!" అభయముద్ర పెట్టి మరీ చెప్పాడు రణధీర్...

బిందూ సిగ్గుల మొగ్గయింది!

★ ★ ★

అది కాకులు దూరని కారడవి !....

ఆ అడవిలో మొత్తం పదహారు పులులున్నాయని అటవీశాఖ వారు నోటిఫై చేశారు. ఎప్పుడో కానీ అటవీశాఖ అధికారులు ఆ ప్రాంతానికి రారు. చుట్టూ ఎటు చూసినా

ఎత్తుగా ఎదిగిన మహావృక్షాలూ... మధ్యమధ్య రాళ్ళ గుట్టలూ... వాగులూ...!

అయితే, ఆ అటవీ ప్రాంతానికి చుట్టుపక్కల చిన్న చిన్న గ్రామాల్లో ఉన్న గిరిజనులు కొందరు అప్పుడప్పుడు అడవిలోకి వచ్చి తేనె, చింతపండు, కుంకుడుకాయలు వంటి వాటిని సేకరించుకుని వెడుతూంటారు. ఫారెస్టు డిపార్ట్‌మెంట్ తాలూకు మనుషులు చూస్తే మాత్రం వాళ్ళను బెదిరించి ఆ సరుకంతా లాక్కుంటారు!

పొద్దువాలితే ఆ ప్రాంతంలో మనుష్య సంచారం కనిపించదు. అక్కడే స్థావరాలు ఏర్పరచుకొని తీవ్రవాదులూ, బందిపోట్లూ రహస్యంగా తమ కార్యకలాపాల్ని సాగిస్తున్నట్టు పోలీసు వర్గాలకు రూఢిగా సమాచారం అందటం వల్ల - రాజధాని నగరం నించి వచ్చిన ప్రత్యేక దళాలు గత ఇరవై రోజులుగా - ఆ ప్రాంతాల్లోనే గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి.

ఆ రోజు ఉదయం -

కొండ దిగువన ఉన్న లోయలో రఘువీర్ దళం మనుషులు చలి కాచుకుంటున్నారు.. కొండపైన కూర్చుని బీడీ కాలుస్తున్న టిల్లూకి - దూరంనించి వ్యాన్లు వస్తున్న శబ్దం వినిపించింది...

ఒక్క పరుగున లోయలోకి దిగి వచ్చాడు!

"అన్నా! మన అడవుల్లోకి ఏవో వ్యాన్లు వస్తున్నాయి!" అక్కడున్నవాళ్ళకు చెప్పాడు ఆయాసపడుతూ..

అందరూ చెవులు రిక్కించి విన్నారు.

"అవును భాయ్! అవి వ్యాన్లే! బహుశా పోలీసులే అయ్యుంటారు. మనల్ని పట్టుకునేందుకు - కేపిటల్ నించి - స్పెషల్ ఫోర్స్ వచ్చిందట. నిన్న వార్తల్లో చెప్పారుగా!" అన్నాడు సుభాన్.

"వాళ్లే కావచ్చు. మనవాళ్లనందర్నీ అలర్ట్ చేయండి. గన్స్‌తో రెడీగా ఉండండి!" అంటూ తన గన్ చేతిలోకి తీసుకున్నాడు రఘువీర్.

మరో అయిదు నిమిషాలు గడిచాయి...

పోలీసు వ్యాన్లు 'లోయ'ను సమీపించాయి... రఘువీర్ దళం సభ్యులు వ్యాన్ల మీదకు బాంబులు విసిరారు.

"కమాన్! అటాక్!" - ముందు సీట్లో కూర్చున్న రణధీర్ జీపులోంచి కిందకు ఉరికి - తన వెంట వచ్చిన పోలీసు బలగానికి 'ఆర్డర్స్' జారీ చేశాడు.

అటు పోలీసులూ... ఇటు రఘువీర్ దళం సభ్యులు.

ఇరువర్గాల మధ్యా అయిదారు గంటల హోరాహోరీ పోరాటం సాగింది. ఆ అటవీ

ప్రాంతమంతా తుపాకీ గుళ్ళ శబ్దాలతో మార్మోగిపోయింది! ఇరు వర్గాలలోనూ ప్రాణనష్టం అపారంగా సంభవించింది.

★ ★ ★

ఇంటి ముందు జీపు ఆగిన శబ్దం విని - వంటింట్లోంచి బయటకు వచ్చింది ఇంద్రావతి.

జీప్‌లోంచి కిందకు దిగిన వ్యక్తి ఆమెను సమీపించి అడిగాడు -

"ఇక్కడ ఇంద్రావతిగారని..."

"నేనే బాబూ!" ఆత్రంగా చూస్తూ చెప్పిందామె.

"నమస్కారమమ్మా! నేను పోలీసు డిపార్ట్‌మెంట్‌నించి వచ్చాను. రండి! లోపల కెళ్లి మాట్లాడుకుందాం!" అంటూనే అతను గబగబా లోపలకు నడిచాడు.

ఇంద్రావతికి అయోమయంగా ఉంది.

'పోలీస్ డిపార్ట్‌మెంట్ నించి ఆ వ్యక్తి తనింటికి ఎందుకొచ్చినట్టు?' అలా ఆలోచించిన ఆమె మనసేదో కీడును శంకించింది. అంతలో పక్క గదిలోంచి బిందూ కూడా అక్కడకు వచ్చింది.

"ఈయన పోలీసు డిపార్ట్‌మెంట్ నించి వచ్చారటమ్మా?" ఆందోళన నిండిన స్వరంతో కూతురికి చెప్పింది ఇంద్రావతి.

"మీరు 'బిందూ' కదూ?"

వెంటనే ఆవ్యక్తి ప్రశ్నించాడు. అవునన్నట్టు చూసిందామె.

"నేను జగన్‌ని!... రణధీర్ స్నేహితుణ్ణి". పరిచయం చేసుకున్నాడతను... అప్రయత్నంగా చేతులు జోడించి నమస్కరించింది బిందూ.

"ఏవన్నా 'మెసేజ్' తెచ్చారా ఆయన దగ్గర్నించి?" ఆత్రంగా అడిగింది.

క్షణంసేపు అతను మౌనంగా చూసి తల వంచుకున్నాడు.

బిందూ, తల్లివైపు చూసింది.

అంతలో అతను నెమ్మదిగా చెప్పాడు -

"సారీ సిస్టర్! మొన్న రాంపూర్ దగ్గర అడవుల్లో పోలీసులకీ, తీవ్రవాదులకీ మధ్య ఎన్‌కౌంటర్ జరిగింది. అందులో రణధీర్..." మరి చెప్పలేక ఆగిపోయాడు జగన్...

బిందూ విషయాన్ని అర్థం చేసుకోగలిగింది... తన రణధీర్‌కేదో ఆపద సంభవించిందని క్షణంలో గ్రహించింది...

"ఏమైంది? త్వరగా చెప్పండి! ప్లీజ్!" - భయంనిండిన స్వరంతో ప్రశ్నించింది.

"చెప్పునాయనా!" ఇంద్రావతి అడిగింది వెంటనే.

"సారీ మేడం! భగవంతుడు అతనికింత అన్యాయం చేస్తాడని అనుకోలేదు. నేడో రేపో కొందర్నైనా తీవ్రవాదుల్ని పట్టుకుని ప్రభుత్వానికి అప్పగించాలనీ, ఆ తర్వాత సెలవు పెట్టి హాయిగా కొన్నాళ్ళు 'మేరీడ్ లైఫ్' ఎంజాయ్ చేయాలనీ ఎంతో ఆశపడ్డాడు. కానీ, ఆ భగవంతుడు మరొకటి తలపెట్టాడు. తీవ్రవాదుల కాల్పులకి అతన్ని బలి చేశాడు." అతని గొంతు గాద్గదికమైంది.

పిచ్చెక్కిన మనిషిలా చూస్తూండిపోయింది బిందూ.

"భగవంతుడు చేసిన అన్యాయం కాదండీ ఇది! మానవరూపాల్లో తిరుగుతున్న కొంతమంది కిరాతకులు చేసిన నేరం!" ఆవేశంగా అంది ఇంద్రావతి.

"అమ్మా!" అంటూ తల్లి గుండెలపై వాలిపోయి రోదించసాగింది బిందూ.

"నేరస్థుల్ని పట్టుకున్నామండీ! వాళ్ళని ప్రభుత్వం వదిలిపెట్టదు. అయితే అసలైనవాడు దొరకాలి. 'బన్సీ' అని వాళ్ళ నాయకుడు. అతని కోసం గాలింపు ఉధృతం చేశాం. అతనిది ఈ ఊరేనని కూడా తెలుసుకున్నాం. ఇక్కడి క్రైం బ్రాంచి - కేసు టేకప్ చేసింది!" చెప్పాడతను.

అయితే, ఇంద్రావతికి 'బన్సీ' అనేపేరు తప్ప ఆ తర్వాత మరేమీ వినిపించలేదు.

"ఎవరు బాబూ? ఆ నాయకుడి పేరేమిటన్నావ్?" ఆత్రంగా చూస్తూ ప్రశ్నించింది.

"బన్సీ! కానీ, మారుపేర్లు చాలా ఉన్నాయండీ అతనికి. రఘువీర్ అనేపేరుతో ఇటీవల చాలాకాలంగా దారిదోపిడీలు చేశాడు..."

"అతను... ఆ బన్సీ ఎలా ఉంటాడో మీరు చూశారా బాబూ?" వెంటనే అడిగిందామె.

"లేదమ్మా! అడవుల్లో రహస్యంగా తిరిగేవాళ్ళు అంత సులువుగా కనిపిస్తారా? కానీ, అతని సహచరుల దగ్గర అతని ఫోటో దొరికింది. ఇది ఇవాళ పేపరుకిస్తున్నాం. ఇతణ్ణి పట్టిచ్చినవారికిగానీ, ఇతని సమాచారం తెలియజేసినవారికిగానీ బహుమతి కూడా ప్రకటిస్తున్నాం!" అంటూ జేబులోంచి తీసిన ఫోటోను ఆమెకు చూపించాడు జగన్.

ఫోటోలోకి చూసిన ఇంద్రావతి అప్రతిభురాలైంది.

★ ★ ★

రాత్రిపదకొండు దాటింది...

ఊరంతా నిద్రపోతోంది. నల్లటి నిశ్శబ్దం రాజ్యమేలుతోంది.. ఆ చీకట్లో సైకిలు తొక్కుకుంటూ వచ్చిన బన్సీ, ఇంటి ముందు సైకిల్‌కి స్టాండువేసి తలుపు తట్టాడు... లోపలినుంచి బదులు రాలేదు..

మరింత గట్టిగా తట్టాడు. తలుపు దానంతటదే తెరుచుకుంది....

'తలుపు తీసి నిద్రపోతున్నారేమిటి చెప్మా!' అనుకుంటూనే లోపలకు ప్రవేశించాడు బన్సీ....

గదిలో అంతటా చీకటి... కన్నుపొడుచుకున్నా ఏదీ కనిపించటం లేదు.

"అమ్మా!" పిలిచాడు.

బదులురాలేదు.

"బిందూ...!" చెల్లెల్ని పిలిచాడు.

అయినా జవాబు రాలేదు.

చీకట్లో నెమ్మదిగా తడుముకుంటూ గోడ దగ్గరకెళ్ళి స్విచ్ వేశాడు. లైటు వెలగటంతో గదిలో వెలుతురు పరుచుకుంది. ఆ వెల్తురులో అతని కళ్ళ ముందు కనిపించిన దృశ్యం భయకంపితుణ్ణి చేసింది.... చాప మీద తన తల్లీ, చెల్లెలూ నిర్జీవంగా పడిఉన్నారు...

"అమ్మా!" అంటూ ఆత్రంగా తల్లిని చేరుకుని ఆమె భౌతికదేహాన్ని అటూ ఇటూ కదుపుతూ కన్నీరు మున్నీరయ్యాడు. జీవంలేని కళ్ళతో ఎటో చూస్తున్నట్టుగా ఉన్న బిందూ శరీరాన్ని చుట్టేసుకుని "చెల్లాయ్" అంటూ విలపించాడు.

అంతలో అతని చూపు తల్లి చేతికింద - గాలికి రెపరెపలాడుతున్న కాగితంపై పడింది. ఆ కాగితాన్ని చేతిలోకి తీసుకుని చదవసాగాడు -

".... బన్నీ! నువ్ వస్తావని తెలుసు. కానీ, నీ ముఖం చూడలేకనే మేమిద్దరం ఈ నిర్ణయం తీసుకున్నాం... ఎన్నో నేరాలూ, ఘోరాలూ చేసిన నువ్వు నా కొడుకువని చెప్పుకుంటూ జీవచ్ఛవంలా బ్రతికేకంటే ఒకేసారి ప్రాణాలు తీసుకోవటం మంచిదని పించిందిరా! పసుపు కుంకుమలు పెట్టి అత్తవారింటికి సాగనంపాల్సిన తోడబుట్టినవాడే తనక్కాబోయే భర్త చావుకి కారకుడు కావటం బిందూ తట్టుకోలేక పోయిందిరా... నీ తుపాకీ గుళ్ళకు బలైపోయినవాళ్ళల్లో బిందూ భర్త ఉన్నాడన్న సంగతి నీకు తెలియకపోవచ్చు. కానీ, నువ్వు ముళ్ళదారిలో నడుస్తున్నావనీ చీకటి బ్రతుకు బ్రతకుతున్నావనీ తెలిసిన తర్వాత మేం బ్రతకటం అనవసరమనిపించింది... అందుకే ఆత్మహత్య చేసుకుంటున్నాం... మళ్ళీ జన్మలో ఆడదానిగా పుడితే గొడ్రాలిగానైనా వుంచమని ఆ దేవుణ్ణి ప్రార్థిస్తాను. కానీ నీలాంటి కొడుకును మాత్రం కోరుకోను... ఇట్లు"

ఆ తర్వాత 'అమ్మ' అనే అక్షరాలు రాసి మళ్ళీ కొట్టేసినట్టుగా కనిపించింది....

ఆ ఉత్తరంలోకి చూస్తూ అలాగే విలపిస్తూ ఉండిపోయాడు చాలసేపు బన్నీ !!

*(ఇండియాటుడే 21-4-1994)*

★ ★ ★